


# నవభూమి

## పాలమూరు

అనుబంధం

10 సెప్టెంబర్,2024 మంగళవారం పేజీలు:4

www.epaper.navabhoomi.in


# ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు



**వెల్దండ–నవభూమి :** రంగారెడ్డి జిల్లా లో కురిసిన భారీ వర్షానికి దిగువనున్న వెల్దండ మండలానికి నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో వెల్దండ మండలం బొల్లంపల్లి కొత్త చెరువు నిండుకుండను తలపిస్తున్నది. వెల్దండ మండలం గాన్‌గట్టుతండా, వెల్దండ–చారకొండ ప్రధాన రహదారిపై భైరాపూర్ వద్ద వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు జూపల్లి తదితర గ్రామాల్లో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. శిరుసనగండ్లలో చింతకుంట చెరువు పూర్తిగా నిండి అలుగు పారుతున్నది. అదేవిధంగా చారకొండ వాగుపై ఉన్న కత్వా ఉధృతంగా ప్రవహిస్తున్నది. మండలంలో 63.8 వర్షపాతం నమోదు అయినట్లు ఏ ఎస్వో విక్రంరెడ్డి తెలిపారు. ఊర్కొండ మండలంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది.



నిలిచిపోయాయి. వెల్దండ తాసీల్దార్ రవికుమార్, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్సై కురుమూర్తి వంతెనలను పరిశీలించి రాకపోకలు నిలిపివేయించారు. పోచమ్మతండాలో పత్తిపంట నీటమునిగింది. రాచూర్‌లో రజియాబేగం ఇల్లు కూలింది. చారకొండ మండల కేంద్రంతోపాటు శిరుసనగండ్ల, చంద్రాయన్‌పల్లి, గోకారం, తుర్కలపల్లి, మండలంలోని బొమ్మరాజుపల్లి, రాంరెడ్డిపల్లి, జగబోయిన్‌పల్లి, జకినాలపల్లి గ్రామాల్లో కురిసిన భారీ వర్షానికి ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలు అలుగుపారాయి. అదే విధంగా పలు చోట్ల వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి.

# రిజర్వాయర్ కట్ట ఎత్తు పెంచాలి

**అయిజ–నవభూమి :** చిన్నోనిపల్లి రిజర్వాయర్ కట్ట ఎత్తు పెంచకపోవడంతో అయిజ మండలంలోని సింధనూర్, టీటీదొడ్డి గ్రామాలతోపాటు ఆర్డీఎస్ ప్రధానకాల్వకు ముప్పు పొంచి ఉన్నదని మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు రాములు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం గట్టు మండలంలోని చిన్నోనిపల్లి రిజర్వాయర్‌ను సింధనూర్, టీటీదొడ్డి గ్రామాల రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. 18ఏండ్లుగా చిన్నోనిపల్లి రిజర్వాయర్ పనులు పెండింగ్‌లో ఉండటం, ప్రస్తుతం రిజర్వాయర్‌కు భారీ వరద వచ్చి చేరుతుండడంతో దిగువన ఉన్న గట్టు మండలంలోని లింగాపురం, అయిజ మండలంలోని సింధనూర్, టీటీదొడ్డి గ్రామాల పరిధిలోని దాదాపు 5వేల ఎకరాల భూమి కోతకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. అలాగే ఆర్డీఎస్ ప్రధానకాల్వకు గండి పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వాయర్ 55అడుగుల మేర ఎత్తు ఉండాల్సి ఉండగా, ఒక వైపున 150 మీటర్ల పొడవు 30అడుగుల మేరకే మట్టి పటిష్టం చేయడంతో 20రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద రిజర్వాయర్‌లోకి చేరి తక్కువ ఎత్తులో ఉన్న కట్ట వద్ద నీటి మట్టం క్రమేపీ పెరుగుతుందన్నారు. వరద పెరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నట్లు పేర్కొన్నారు. కట్ట పటిష్టం చేయడంతోపాటు నిబంధనల మేరకు కర కట్ట ఎత్తు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు కట్టఎత్తును పెంచి ప్రమాదం జరగకుండా నిలువరించడంతోపాటు నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# చిన్నోనిపల్లిలో పర్యటన



ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

**గట్టు–నవభూమి :** చిన్నోనిపల్లివాసుల యోగక్షేమాల బాధ్యత తనదేనని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. చిన్నోనిపల్లిలో ఆయన ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ తిరుగుజలాలు చేరి న కిందిగేరి ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రా మస్తులు, నిర్వాసితులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టి కి తీసుకొచ్చారు. అనంతరం పునరావాస కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ వర్షాలు రావడంతో చిన్నోనిపల్లిలోకి వరద వచ్చి చేరిందన్నారు. సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని తెలిపారు. పునరావాస కేంద్రంలో మౌలిక వసతులు కల్పిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలోని 250 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.7,500 చొప్పున షిఫ్టింగ్ చార్జీలను సో మవారం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆలూరు పునరావాస కేంద్రం మాదిరి చిన్నోనిపల్లిని కూడా తీర్చిదిద్దనున్నట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు రామన్‌గౌడ్, కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్, దేవేందర్, వీరే శ్, షడ్రిక్, మునిచంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**ముంపు గ్రామాల్లో పర్యటన..**

మండలంలోని బోయలగూడెం, లింగాపురం తదితర గ్రామాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. చిన్నోనిపల్లి రిజర్వాయర్ నుంచి తమకు ముంపు ఉందని కొంతకాలంగా బోయలగూడెం, లింగాపురంతోపాటు పలు గ్రా మాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఎమ్మె ల్యే రిజర్వాయర్ ప్రాంతాన్ని ఆదివారం పరిశీలించారు. ఉన్నతాధికారులు, సంబంధిత శాఖాధికారులతో మాట్లాడారు. రిజర్వాయర్ నుంచి నీరు బయటకు వెళ్లే విధంగా అవసరమైన చర్యలన్నీ తీసుకుని ఏ గ్రామం కూడా ముంపునకు గురికాకుండా చూడాలని ఆదేశించారు.

# న్యాయ పోరాటం చేస్తాం

**కొల్లాపూర్–నవభూమి:** ఎస్సీ వర్గీకరణ అంశంమీద సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై మాల మహానాడు, మాలల చైతన్య సమితి ఆధ్వర్యం లో న్యాయ పోరాటం చేస్తామని మాలల చైతన్య సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దెల రాం దాస్ పేర్కొన్నారు. ఆదివారం ఉమ్మడి పాలమూ రు జిల్లా కేంద్రంలో ఎస్సీ వర్గీకరణను వ్యతిరే కిస్తూ మాలలు చేపట్టిన కార్యక్రమానికి కొ ల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల నుంచి పెద్ద ఎ త్తున మాలలు వాహనాల్లో తరలివెళ్లారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై మాలల భవిష్యత్తు కార్యాచ రణ నిర్వహించడానికి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి దళిత ఉద్యమ నేత చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, వర్ధన్న పేట ఎమ్మెల్యే నాగరాజు, దళిత కార్డియాలజిస్టు డాక్టర్ గోపినా థ్, ప్రొఫెసర్ దిగంబర్ కాన్విలు సమావేశానికి హాజరవుతున్నట్లు రాందాస్ పేర్కొన్నారు. మాలల ఐక్యతతో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని వ్యతిరేకిస్తూ భవిష్యత్తు ప్రణాళిక రూపొందిస్తామని తమకు న్యాయం జరిగేంత వరకు వివిధ రూపాల్లో ఆందోళన చేపడుతామని మద్దెల రాందాస్ పేర్కొన్నారు. మాలమహానాడు నాయకులు బిజ్జ దేవదాస్, ఎర్రశ్రీను, తిరుపాటి నాగరాజు, గడ వండ్ల శ్రీను, అర్జున్, కర్నె విష్ణు, హనుమంతు, చిన్న కుర్మయ్య, భరత్ తదితరులు పాల్గొన్నారు.



# వరదలో గల్లంతైన పశువుల కాపరి మృతి




**ఆత్మకూరు-నవభూమి :** వరదనీటిలో కొట్టుకుపోయి పశువుల కాపరి మృతిచెందిన ఘటన మండలంలోని మేడెపల్లిలోచోటుచేసుకున్నది. మేడెపల్లికి చెందిన గొల్ల తిరుపతన్న(45)పశువులను మేపేందుకు శనివారం రా వు న్ పా డు డ్యాం వై పు వెళ్లాడు.సాయంత్రం తిరిగి ఇంటికి వస్తుండగా, దొరాయికుంట వద్ద పారుతున్న వాగులో కాలుజారిపడి వరద ధాటికి కొట్టుకపోయాడు. గ్రామస్తులు గాలించినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ఎంత గాలించినా ఫలితం లేకపోయింది. ఆదివారం ఉదయం కుంటకు కిలోమీటరు దూ రంలో మృతదేహం లభ్యమైంది. మృతుడి తమ్ముడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేందర్ తెలిపారు.

# అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలి


**వడ్డేపల్లి-నవభూమి :** భారత్‌మాల రోడ్డు నిర్మాణంలో భాగంగా వడ్డేపల్లి మండలంలో కొద్ది రోజులుగా అక్రమ మైనింగ్ పనులు జరు గుతున్నాయని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఆరోపించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమ తులు లేకుండా సదరు కంపెనీ యాజమాన్యం పనులు చేపట్టి మట్టిని తరలిస్తున్నారని అన్నారు. ఇందుకు గాను శనివారం నాయకులతో కలిసి వడ్డేపల్లి పాలిటెక్నిక్ కళాశాల వద్ద దీక్ష చేపట్టి అక్కడే కూర్చొని నిరసన తెలిపారు. ఈ సం దర్భంగా మాట్లాడుతూ సహజ వనరులను కాపా డాల్సిన అధికారులే నాయకుల ఒత్తిడితో అక్రమ తవ్వకాలను పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారు లు స్థానిక ప్రజాప్రతినిధి అవినీతికి పాల్పడుతు న్నారని ఆరోపించారు. పగలు, రాత్రి బ్లాస్టింగ్‌కు పాల్పడుతూ టిప్పర్ల ద్వారా రూ.కోట్ల విలువైన మట్టిని తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు. వడ్డేపల్లి పాలిటెక్నిక్ కళాశా లకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న ఇంజనీరింగ్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, పోలీసు ఉన్నతాధికారులను కోరగా, స్పందించిన పోలీసులు, రెవెన్యూ సిబ్బంది వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం కోసం 29 పాఠశాలలను ప్రభుత్వం మంజూరు చేసింది. వాటిలో ఒక పాఠశాలను జిల్లాలో వడ్డేపల్లిలో మంజూరుకు ప్రభుత్వంతో మాట్లాడి సంపత్‌కుమార్ కృషి చేశారు. సీఎం ఆదేశాల మేరకు వడ్డేపల్లి మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ హైస్కూల్ నిర్మాణం కోసం ప్రభుత్వం అనుమతి లభించడంతో శనివారం అధికారులతో కలిసి స్కూల్ నిర్మించే ప్రాంతాన్ని పరిశీలించారు.

# చెరువులో పడి ఇద్దరు చిన్నారుల మృతి

**నారాయణపేట-నవభూమి :** నారాయణపేట జిల్లా నారాయణపేట మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలోని ఆశిరెడ్డి చెరువులో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. ఆదివారం జరిగిన సంఘటనపై గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన రాజమ్మ సోదరుడు ఇటీవల మృతి చెందాడు. దీంతో ఆమె, నలుగురు పిల్లలతో కలిసి ఐదురోజుల క్రితం తల్లిగారి ఊరైన తిర్మలాపూర్‌కు వచ్చింది. సోదరుడి ద్వాదశ దినకర్మ ముగిసిన అనంతరం శనివారం తన గ్రామానికి వెళ్ళాలనుకున్నా, అనివార్య కారణాలతో వెళ్ళలేక పోయింది. ఆదివారం ఉదయం దుస్తులు ఉతుక్కునేందుకు నలుగురు పిల్లలతో కలిసి గ్రామ సమీపంలోని ఆశిరెడ్డి చెరువుకు వెళ్ళింది. ఆమె దుస్తులు ఉతుకుతుండగా, నలుగురు చిన్నారులు చెరువులో దిగి ఆడుకుంటూ కాస్తా లోతుకు వెళ్లడంతో నీటిలోకి జారిపోయారు. వారిని తల్లి గమనించి కాపాడేందుకు వెళ్లి ఆమె కూడా ప్రమాదంలో చిక్కుకున్నది. అక్కడే ఉన్న గ్రామస్థులు కొందరు రాజమ్మతో పాటు ఇద్దరు పిల్లలు మంగళ, కీర్తిలను కాపాడారు. మరో ఇద్దరు పిల్లలు మూగ బాలిక ప్రీతి (14), ప్రవీణ్ అలియాస్ రోహిత్ (12) నీటిలో మునిగి చనిపోయారు. గ్రామస్థుల నుంచి సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ సి.రాముడు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రాణాలతో బయట పడ్డ చిన్నారులను, మరో ఇద్దరి మృతదేహాలను నారాయణపేట ఆసుపత్రికి తరలించారు.



# ఎన్నికల ఏర్పాట్లలో అధికార యంత్రాంగం



**మహబూబ్‌నగర్-నవభూమి:** త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలను బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నది. ఉమ్మడి జిల్లాలో స్థానికంపై పట్టు సా ధించేందుకు ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించిం ది. బీసీల రిజర్వేషన్, పంచాయతీల రిజర్వేషన్ తేలా క ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం తుది ఓటర్ జాబితా ఖరారు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికలకు స మయం కాదని అధికార పార్టీ భావిస్తోంది. 2024 జనవరి 31 తో స్థానిక సంస్థలు ఎన్నికల గడువు ముగిసింది. ఇప్పటికే 9నెలలు గడిచినప్పటికీ లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించేందుకు జంకుతోంది. అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ 10నెలల్లోనే ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకోవడంతో ఎన్నికలకు వెళ్తే ఎదురుదెబ్బ తప్పదనే ఆలోచనతో వెనకడుగు వేస్తున్నది. కాగా, ఈ సారి లోకల్ బాడీ ఎలక్షన్లు నువ్వా, నేనా అన్నట్లు సాగుతాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**ఎమ్మెల్సీ గెలుపుతో గులాబీ పార్టీలో జోష్..**

ఉమ్మడి మహబూబ్‌నగర్ సీఎం రేవంత్‌రెడ్డికి సొంత జిల్లా. ఈ జిల్లాలో బీఆర్ఎస్ బలంగా ఉన్న ది. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు దాదాపు 90% వరకు బీఆర్ఎస్ పార్టీ వారే ఉన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అనూహ్య విజయం సాధించింది. కోట్లు కుమ్మరించినా గులాబీ పార్టీ గెలుపును ఆపలేకపోయారు. దీం తో అధికార కాంగ్రెస్‌కు బిగ్‌షాక్ తగలడంతో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను లాగేందుకు విశ్వప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ బలంగా ఉండడంతో అధికార పార్టీ ఎన్నికల నిర్వహణకు వెనకడుగు వేస్తుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలంతా ఒక్కతాటిపై..**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, అలంపూర్ ఎమ్మెల్యే, ఎ మ్మెల్సీలంతా ఒక్కతాటిపై ఉండి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ గెలుపునకు కృషి చేశారు. ఇదే ఊపుతో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా విజయఢంకా మోగించేందుకు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్రంలో తృటిలో అధికారం కోల్పోయినప్పటికీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను కాపాడుకోవడంలో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించింది. నియోజకవర్గాల్లో పట్టు సడలకుండా పర్యటిస్తూ క్యాడర్‌లో ఉత్సాహాన్ని నింపుతున్నారు. అధికార పార్టీ ప్రజావ్యతిరేక విధానాలను నిలదీస్తున్నారు.

**బీఆర్ఎస్ నేతలే టార్గెట్..**

నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ నియోజకవర్గంలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. స్వయంగా మంత్రి ఉన్నప్పటికీ రౌడీ రాజకీయం చేస్తూ బీఆర్ఎస్ నేతలపై దాడులకు తెగబడుతున్నారు. మరోవైపు ఇసుక దందా చేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుండగా, అధికారం, పోలీసుల అండదండలతో ప్రశ్నించిన వారిపై దాడులకు దిగుతున్నారు. అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నా గులాబీ సైన్యం వెనుకడుగు వేయకుండా న్యాయపోరాటం చేస్తున్నారు.

**కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత..**

అసెంబ్లీ ఎన్నికల్లో మార్పు అంటూ కొంతమంది చేపట్టిన గ్లోబల్ ప్రచారానికి బీఆర్ఎస్ తక్కువ శా తంతో ఓటమి పాలైంది. అధికారం చేపట్టిన కాం గ్రె స్ ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయకపోవడం తో ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్నది. పింఛన్లు, రై తు భరోసా, సాగునీరు, పంట నష్టపరిహారం చెల్లించకపోవడం, ఆరు గ్యారెంటీలు అమలు నోచుకోకపోవడం వంటిఅంశాలు అధికార పార్టీని ఉక్కిరిబిక్కి రి చేస్తున్నాయి. గ్రామీణప్రాంతాల్లో నిలదీతలు ప్రా రంభమయ్యాయి. సమస్యలపై బీఆర్ఎస్ నేతలు ఎ క్కడికక్కడ ప్రశ్నిస్తూ ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతున్నారు. దీంతో బీఆర్ఎస్‌కు మద్దతు లభిస్తున్నది.

# రైతన్నల అప్పుల 'పాలు'



**ఊర్కొండ-నవభూమి::** రెండు నెలలుగా విజయ డెయిరీ పాలబిల్లులు చెల్లించకపోవడంతో రైతన్నలు అప్పులపాలవుతున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గిరినాయక్ పేర్కొన్నారు. పాలబిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలకేంద్రంలోని ఎన్‌హెచ్-167పై పాలు పోసి నిరసన తెలిపారు. అనంతరం ధర్నా, రాస్తారోకో చేపట్టారు.రైతులకు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా గిరినాయక్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలోని రైతులపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేయడం తగదని సూచించారు. పాడి పరిశ్రమను నమ్ముకొని జీవనం సాగిస్తున్న తమకు నెలల తరబడి బిల్లులు చెల్లించడం లేదన్నారు. సకాలంలో బిల్లులు రాకపోవడంతో పాడి రైతులు దాణా కొనుగోలు, ఆవుల నిర్వహణకు అప్పులు చేయవల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఊర్కొండపేట బీఎంసీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ యువ పాడి రైతులు వానకాలం సాగు, పాఠశాలల ఫీజుల చెల్లింపునకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇకనైనా విజయడెయిరీ రైతులకు పెండింగ్ బిల్లులు మొత్తం ఒకేసారి ఖాతాలో జమ చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పెండింగ్ బిల్లుల చెల్లింపుపై స్పష్టమైన హామీ ఇచ్చేవరకు కదిలేదిలేదని రైతులు భీష్మించుకు కూర్చున్నారు. కార్యక్రమంలో బీజేపీ నేత ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకులు కృష్ణగౌడ్, తిరుపతిరెడ్డితోపాటు పాడి రైతులు పాల్గొన్నారు.

# పంట నష్ట పరిహారం ఇవ్వాలి



**ఆత్మకూరు-నవభూమి :** వారం రోజులుగా కురిసిన అధిక వర్షాలకు ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో రైతుల పంటలు ముంపునకు గురయ్యాయని పాలమూరు ఎంపీ డీకే అరుణ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన రైతులందరికీ తక్షణమే పరిహారం చెల్లించాలని డి మాండ్ చేశారు. ఆదివారం ఆమె వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం ఖానాపూర్‌లో ముంపునకు గురైన వరి పంటను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. అధిక వర్షాల కారణంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వరి, కంది, పత్తి, ఆముదంతో పాటు ఇతర పంటలు వేల ఎకరాల్లో ముంపునకు గురయ్యాయని, తీవ్ర నష్టం వాటిల్లిందని చెప్పారు. రూ.వేలకు వేలు పెట్టుబడి పెట్టి, పంటలను కన్న బిడ్డల్లా కాపాడుకున్న రైతులు ప్రస్తుత పరిస్థితితో తీవ్ర ఆవేదనకు గురయ్యారన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యంగా భావించి తెలంగాణ రాష్ట్రానికి రూ. 3,600 కోట్లను మంజూరు చేసిందన్నారు. పాలమూరు, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లోని కలెక్టర్లు వ్యవసాయ అధికారులు, తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేసి.. పంట నష్టాలను గుర్తించాలన్నారు. నారాయణపేట, పాలమూరు, వనపర్తి జిల్లాల్లో పాత ఇళ్లు కూలిపోయి పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి రాష్ట్ర ప్రభుత్వం నిత్యావసర సరుకులు అందించాలన్నారు. పక్కా ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో వనపర్తి జడ్పీ మాజీ చైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి, మునిసిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ అశ్విని కుమార్, వార్డు కౌన్సిలర్ చెన్నయ్య, బీజేపీ నాయకులు సూరి, సద్దల వెంకట రాములు, మేడపల్లి ఆంజనేయులు, చందు, రైతులు పాల్గొన్నారు.

## గుట్టపై బ్లాస్టింగ్ చేస్తే ఊరుకోం..

**ఊర్కొండ-నవభూమి** : నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊర్కొండపేట శివారులో ఉన్న గుట్టలపై అనుమతి లేకుండా రాతి కడీలు, రాయి ఎలా తీస్తారని అదే గ్రామ పం చాయతీ పరిధిలోని ఠాకూర్ తండావాసులు ఆదివారం అడ్డుకు న్నారు. ఈ విషయం తెలియడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని చేరుకొని ఇరువర్గాలను శాంతింపజేసి, అక్కడి నుంచి అందరినీ బయటికి పంపారు. ఈ సందర్భంగా ఠాకూర్ తండావాసులు మాట్లాడుతూ వ్యవసాయం చేసుకునే మేము, తండాలోని పశు వులు, మేకలు, గొర్రెలను గుట్టపైనే మేతకు వదిలేసి, వ్యవసా య పనులు చేసుకుంటామని అన్నారు. వడ్డెర కూలీలతో మధ్య దళారులు ఒప్పందం చేసుకొని ఈమధ్యన గుట్టపై బ్లాస్టింగ్ చేస్తూ రాతికడీలు, రాయి తీస్తున్నా రని, యంత్రాల ద్వారా రాయిని కోస్తుండటంతో దుమ్ము, దూళి పడిపంటలు దెబ్బతింటున్నాయని తెలిపారు. బ్లాస్టింగ్ శబ్దాల కు పశువులు భయపడి పారిపోతున్నాయన్నారు. అనుమతి లేకుండా రాయి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ జీవనోపాధికి ఇబ్బందులు కలిగిస్తున్న వారిని అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తండా వాసులు విజేందర్‌నాయక్, లచ్చిరామ్‌నాయక్, తిరుపతినాయక్, కిరణ్‌నాయక్, జగ్యా, దేవేందర్, శ్రీను,సాయి, గోపి, శేఖర్, సాగ ర్, రమేశ్, మోతిలాల్ ఉన్నారు.

## పెండింగ్ పాలబిల్లులు వెంటనే చెల్లించాలి

**ఊర్కొండ-నవభూమి:** పాల బిల్లులు వెంటనే చెల్లించాలని విజయడెయిరీ పాలఉత్పత్తిదారులు డి మాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. ఊర్కొండపేట బీఎంసీ పరిధిలోని పాల ఉత్పత్తిదా రులు రోడ్డుపై పాల ను పారబోసి, నిరస న వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రె స్ ప్రభుత్వం వచ్చిన ప్పటి నుంచే పాల బిల్లులు సరిగా రావ డం లేదన్నారు. రెం డు నెలల పదిహేను రోజుల(5) బిల్లులు రావాల్సి ఉందని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులతో పశువులకు దాణా పె ట్టలేకపోతు న్నామని, ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపి ధర్నాలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల ఉత్పత్తిదారులు తిర్మని బాలరా జు, సందడి శ్రీనివాస్‌రెడ్డి, బొద శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణా రెడ్డి, రఘురామరెడ్డి, అశోక్‌గౌడ్ ఉన్నారు.

## ఔట్ సోర్సింగే దిక్కు

**మెట్‌పల్లి-నవభూమి :** ఇటీవల పెద్దాపూర్ గురుకుల విద్యాలయంలో మృతి చెందిన ఇద్దరు విద్యార్థుల తల్లిదండ్రులకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగమే దిక్కుకాబోతున్నది. పర్మినెంట్ ఉద్యోగం అనేది తమ ప్రొవిజన్‌లో లేదు.. కాంట్రాక్ట్ ఉద్యోగం ఇయ్యలేం, అవుట్ సోర్సింగ్ విధానంలో అటెండర్ లేదా జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి నియామకంపత్రం అందిస్తున్నాం.. అంటూ ప్రభుత్వం తరపున అధికారులు స్పష్టం చేశారు.ఈ మేరకు మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఆరపేటకు చెందిన విద్యార్థి గణాధిత్య తండ్రి మహేశ్‌కు వచ్చే ఏడాది ఏప్రిల్ 24వరకు అటెండర్ ఉద్యోగం ఖరారుచేశారు. అనిరుధ్ కుటుంబంలో ఒకరికి ఇంకా ఉద్యోగం ఖరారుకానట్లు తెలిసింది. బాధిత కుటుంబాలపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని పలువురు విమర్శిస్తున్నారు. విద్యార్థుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని, ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తామని, ఎక్స్‌గ్రేషియా అందిస్తామని డిప్యూటీ సీఎం ప్రకటించారు. కానీ, ప్రభుత్వం వైపు నుంచి ఆ దిశగా చర్యలు కనిపించడం లేదు.తేల్చని పోస్టుమార్టంగుణాధిత్య, అనిరుధ్ మృతికి గల కారణాలు ఇంకా స్పష్టం కావడంలేదు. సుమారు 45 రోజులు కావస్తున్నా.. పోస్టుమార్టం నివేదికలు బయటకు రాకపోవడం, ఒక వేళ వచ్చిన సంబంధిత అధికారులు కావాలనే కప్పి పుచ్చుతున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.సమగ్ర విచారణేదిగుణాధిత్య, అనిరుధ్ అస్వస్థతకు గురైనప్పుడు సకాలంలో కేర్‌టేకర్, సంబంధిత అధికారి స్పందించి హుటాహుటిన దవాఖానకు తరలించి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదన్న వాదనలూ వినిపిస్తున్నాయి. విద్యార్థుల మృతికి కారణాలు ఏమిటి.. బాధ్యులు ఎవరనేది ఇప్పటికీ తేలలేదు. కనీసం విచారణ కూడా సమగ్రంగా జరగడం లేదు. గుణాధిత్య మృతితో ప్రిన్సిపాల్ విద్యాసాగర్‌ను బాధ్యుడిని చేస్తూ సస్పెండ్ చేసి చేతులు దులుపుకొన్నారు. అనిరుధ్ మృతికి బాధ్యులు ఎవరు.. తీసుకున్న చర్యలు ఏమిటి అనేది ప్రశ్నార్థకం.



# విఘ్నాలు తొలగించు విఘ్నేశ్వరా

**నాగర్‌కర్నూల్-నవభూమి :** వినాయక చవితి పర్వదినం సందర్భంగా నవరాత్రి పూజలు అందుకునేందు కు జిల్లా కేంద్రంలో శనివారం గణనాథులు కొలువయ్యా రు. పట్టణంలోని పలు కాలనీల్లో ఈసారి వినాయక వి గ్రహాలను వినూత్నంగా ఏర్పాటు చేశారు. హౌసింగ్ బోర్డుకాలనీలో మైల్‌స్టోన్ యూత్, రెబల్ స్టార్ యూత్, వీర శివాజీ యూత్ భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు అందిస్తున్నారు. అదేవిధంగా టెలిఫోన్ ఎ క్స్ఛేంజ్ వద్ద వివేకానంద యూత్, రాఘవేంద్రకాలనీలో గో ల్డ్ ఫేస్ యూత్, బజరంగ్ యూత్ ఆధ్వర్యంలో వినాయ కులను ఏర్పాటు చేశారు. రాంనగర్‌కాలనీలో ఫ్రెండ్స్ యూత్, శ్రీరామ యూత్ ఆధ్వర్యంలో భారీ గణనాథులను ఏర్పాటు చేశారు. అర్చకుల పూజలు, ధూప దీప నైవేద్యా లతో కొలువైన గణనాథులు నవరాత్రులు పూజలు అందుకోనున్నారు. మైల్‌స్టోన్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేయగా వివిధ వినా యక మండపాల వద్ద ఉండ్రాల పాయసం, పులిహోర, పరమాన్నం ప్రసాదాలు పంపిణీ చేశారు.



**వినూత్నంగా విగ్రహాలు, మండపాలు**

వీర శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి వినా యకుడి దీవిస్తున్నట్లు కదిలే అభయహస్తం ఏర్పాటు చే యడంతో పాటు హృదయంలో భక్తిని చాటుతున్న హను మంతుని విగ్రహాన్ని మండపంలో ఏర్పాటు చేశారు. అ దేవిధంగా మైల్‌స్టోన్ యూత్ వినాకుడి మండపం యోగీశ్వర ఆకారంలో ఏర్పాటు చేయగా ఫ్రెం డ్స్ యూత్ గణేష్ మండపాన్ని శివలింగం ఆకారంలో ఏర్పాటు చేశారు. సంతబజారు లో సెలక్షన్ సిండికేట్ ఆధ్వర్యంలో కరె న్సీ నోట్లతో అలంకరించిన మండపం లో గణనాథుడు కొలువయ్యాడు. పా త మార్కెట్ యార్డులో జ్ఞాన వికాస భారతి ఆధ్వర్యంలో మట్టి వినాయకుడి ఏర్పాటు చేయడంతో పాటు ఇళ్లలో పూజించేందుకు భక్తులకు మట్టి గణపతులను పంపిణీ చేశారు. వీటితో పాటు పలు కాలనీ ల్లో భక్తులను ఆకట్టుకునేలా విగ్రహా లను మండపాలను అలంకరించారు.

**ఆవంచలో...**

వినాయక చవితి సంద ర్భంగా తిమ్మాజిపేట మండలం ఆవంచలో ఐ శ్వర్య గణపతిని భక్తులు దర్శించుకున్నారు. అలా గే, పలు గ్రామాల్లో ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా భజనలు, కోలాటాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.మండల కేంద్రంలోని గ్రామపం చాయతీ దగ్గర ఏర్పాటు చేసిన శివాజీ యూత్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం అందరినీ ఆక ర్షిస్తున్నది. మండపాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.కల్వకుర్తి పట్టణంలోని బస్టాండ్, తదితర కూడళ్లల్లో ఏర్పాటు చేసిన మండపాలు ప్రత్యేక ఆక ర్షణగా నిలిచాయి. కల్వకుర్తి పట్టణంలోని హనుమాన్ దే వాలయంలో ప్రతిష్ఠించిన గణనాథుని వద్ద భక్తులు భజనలు, కీర్తనలతో మారుమోగింది. గణనాథులు రెండవ రోజు ఆదివారం సైతం ప్రత్యేక పూజలు అందుకున్నారు. కల్వకుర్తి పట్టణంలోని గణనాథులను మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్‌లు వే ర్వేరుగా దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. మం డలంలోని జిల్లెల్ల, మా ర్చాల, కుర్మిద్ద, తాండ్ర, ర ఘుపతిపేట, లింగసానిపల్లి, పంజుగుల, జంగారెడ్డిపల్లి ఎల్లికల్ తదితర గ్రామాల్లో స్థానిక నాయకులు గణనాథున్ని దర్శిం చుకుని పూజలు నిర్వహించారు.మండల కేంద్రంలోని సాయినగర్‌లో కాలనీలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో నాయకులు భూపతి రెడ్డి, చిందం కృష్ణయ్య, బచ్చు రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రంగాపూర్‌లో ఎమ్మెల్యే పూజలు**

మండలంలోని రంగాపూర్‌లో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ గణనాథునికి ప్ర త్యేక పూజలు చేశారు. అచ్చంపేట అసెంబ్లీ యూత్ కాం గ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**చారకొండలో ఏకశిల గణనాథుడికి పూజలు**

చారకొండ సమీపంలోని ఓ వ్యవసాయ పొ లంలో గత కొన్ని ఏళ్లుగా దాదాపు 10 అడుగుల పురాతన ఏకశిల గణనాథుని విగ్రహం ఉంది. వినాయక చవితి పండుగను పురస్కరించుకొని భక్తులు విగ్రహం వద్ద భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. మండల కేం ద్రంలో ఏకశిల గణనాథునికి ప్రత్యేక దే వాలయం నిర్మిం చి నిత్య పూజలు అందుకునే విధంగా చూడాలని చారకొం డ ప్రజలు, భక్తులు కోరుతున్నారు.

**సింధూర వినాయకుడికి పూజలు**

మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయం ఆవరణలో ఉన్న సింధూర వినాయకుడి గుడిలో కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ నాగార్జున, ఎసై వీరబాబు ప్రత్యేక పూజలు నిర్వహించా రు. పాలకమండలి మాజీ సభ్యులు మనోహర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# సుప్రీం తీర్పు బాధాకరం

**పాలమూరు-నవభూమి:** ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు అత్యంత బాధాకరమని, మాలలు సంఘటితంఅయితేనే ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో మాల ఉద్యోగులు, మాలల ఆత్మీయ సమ్మేళనం, మాట-ముచ్చట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్డియాలజిస్టు డాక్టర్ గోపినాథ్, దిగంబర కామ్లే, రవీందర్, కృష్ణలతో కలిసి వారు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దూమర్ల నిరంజన్, రామాకాంత్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వివేక్, కేఆర్ నాగరాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై కేవలం బ్యాక్ బెంచ్(రాష్ట్రాలు అమలు చేసుకోవచ్చనే సూచన)ద్వారా మాత్రమే అనుమతి వచ్చిందని గుర్తు చేశారు. సంపూర్ణంగా అనుమతి ఇచ్చినట్లు, వర్గీకరణ చేసినట్లు కాదన్నారు. ఇప్పట్లో వర్గీకరణ అమలు చేయటం కుదరదన్నారు. బీఆర్ అంబేడ్కర్ ఆశయం దిశగా దళితులంతా ఒక్కటేనని మరువరాదన్నారు. దళితులను విడదీసి పాలించాలనుకునే కుట్రను తిప్పికొడదామన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అత్యంత బాధాకరమని, అది మాలలకు ఏమాత్రం న్యాయం చేయదన్నారు. తీర్పు అంశాలను పరిగణలోకి తీసుకుంటే క్రిమిలేయర్ విధానం ఎక్కడా అప్పీల్‌లో లేదన్నారు. మాలలంతా సంఘటితంగా ఉండి, జిల్లాలో రెండు లక్షల మందితో మహాసభ నిర్వహించి బలనిరూపణ చేద్దామన్నారు. ప్రతీ ఒక్కరు అంబేడ్కర్ మాలను ?ధరించి, దీక్షను పూనాలన్నారు. నేటి పరిస్థితుల్లో మాలల ఐక్యత చాలా అవసరమన్నారు. అనంతరం మాల ఉద్యోగుల సంఘం నాయకులు కృష్ణయ్య, పార్థసారథి, సురేందర్, రవీందర్, నారాయణ, మామిడి సమతా సైనిక్ దళ్ రక్షణ కన్వీనర్ దిగంబర కాంమ్లే పాల్గొని ప్రసంగించారు. అనంతరం అతిథులను ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సన్మానం చేశారు. సభలో ఉమ్మడి జిల్లాకు చెందిన మాలలు అధిక సంఖ్యలో తరలొచ్చారు.



## దురుసు ప్రవర్తనపై ఆగ్రహం



**కరీంనగర్-నవభూమి :** కరీంనగర్ నగరపాలక సంస్థ అధికారులపై మాజీ కార్పొరేటర్ మెండి చంద్రశేఖర్ ప్రవర్తించిన తీరుపై ఉద్యోగ సంఘాలు భగ్గుమన్నాయి. ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఉద్యోగులంతా శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. మధ్యాహ్న భోజన సమయంలో నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు.వీరికి టీఎన్‌జీవో నాయకులు మద్దతు తెలిపారు. గురువారం సాయంత్రం టౌన్ ప్లానింగ్ విభాగంలో ఓ ఫిర్యాదు విషయంలో టీపీఎస్ తేజస్వినిపై మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ నాయకుడు మెండి చంద్రశేఖర్ దురుసుగా ప్రవర్తించడంతో కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ స్పందించి, అధికారులతో కలిసి కలెక్టర్‌తోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు భారత్ న్యాయసంహిత 333, 307, 74, 292, 132, 352, 351(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు, శుక్రవారం మెండి చంద్రశేఖర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. కాగా, ఈ విషయంలో ఇప్పటి వరకు అధికార పార్టీకి చెందిన వారెవరూ స్పందించిన దాఖలాలు లేవు. ఈ విషయం కాస్త ఇప్పుడు నగరపాలక సంస్థలో కార్పొరేటర్లు, ఉద్యోగుల మధ్య చర్చనీయాంశంగా మారింది. ఉద్యోగులపై దురుసు ప్రవర్తన సరికాదంటూ పలువురు చర్చించుకోవడం కనిపించింది.

## పేరుకే సైనిక్ శిక్షణ స్కూల్



**చొప్పదండి-నవభూమి :** రుక్మాపూర్ సైనిక్ శిక్షణ పాఠశాల పేరుకే ఉందని విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేరని పేరెంట్స్ కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత పాఠశాలలో ప్రిన్సిపాల్‌తో సహా కేవలం ఐదుగురు ఉన్నారని మండిపడ్డారు. పాఠశాలలో వెంటనే సరిపడా సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం పాఠశాల ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా పేరెంట్స్ కమిటీ చైర్మన్ శంకర్ మాట్లాడుతూ, పాఠశాలలో ఒక ఆర్మీ శిక్షణ అధికారి, 19 మంది స్టాఫ్ ఉండాలని, ఇప్పుడు అరకొర సిబ్బంది, ఒక ప్రిన్సిపాల్‌తో పాఠశాల నడిపిస్తున్నారని మండిపడ్డారు. ఒక ఆర్మీ శిక్షణ అధికారి, ఆర్మీ డైరెక్టర్ లేరని, తాతాలికంగా ఉన్న 19 మంది సిబ్బందికి ప్రస్తుతం నలుగురు మాత్రమే ఉన్నారని తెలిపారు. తెలంగాణలో ఏకైక సైనిక్ పాఠశాల ఇలా ఉండడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.అహర్నిశలు కష్టపడి పిల్లలను ఇందులో చేర్పిస్తే సిబ్బంది లేకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన పిల్లల బాధలు వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో డైరెక్టర్, ఆర్మీ శిక్షణ అధికారి లేకపోతే విద్యార్థులను దేశానికి సైనికులను ఎలా తయారు చేస్తారని,.

## వడ్డేపల్లి ఇకలేరు



**సిరిసిల్ల-నవభూమి :** సిరిసిల్ల పట్టణానికి చెందిన ప్రముఖ సినీ, గేయ రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ(76) శుక్రవారంఅనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓప్రైవేట్‌దవాఖానలో చికిత్సపొందుతూ తుది శ్వాస విడిచారు.సిరిసిల్లలో అంత్యక్రియలు నిర్వహించారు.జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక గాంధీచౌరస్తాలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, ప్రముఖ కవి జూకంటి జగన్నాథం, సాహితీవేత్తలు ఎలగొండ రవి, వాసరవేని పరశురాములు నివాళులర్పించారు. అలాగే సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో జిల్లా సాహితీ సమితి ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్‌ఆకునూరి శంకరయ్య, వెంగళ లక్ష్మణ్, ఆడెపు లక్ష్మణ్, గెంట్యాల ముత్తయ్య, సడిమెల ఎల్లయ్య, తదితరులు సానుభూతి వ్యక్తం చేశారు.సాహిత్యంపై అభిరుచి..సిరిసిల్ల పట్టణంలోని చేనేత కుటుంబంలో లక్ష్మమ్మ-లింగయ్య దంపతులకు 1948 ఆగస్టు 5న కృష్ణ జన్మించారు.

# విద్యా వ్యవస్థలో మార్పు

**అమరచింత-నవభూమి:** మారుతున్న కాలానికి అనుగుణంగా భారతదేశ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తేవడానికి కేంద్రం కొత్త విద్యా వ్యవస్థను తెస్తోందని ఎంపీ డీకే అరుణ అన్నారు. వనపర్తి జిల్లా అమరచింత మండలం మస్తీపూర్ గ్రామంలో రూ.కోటి పది లక్షల వ్యయంతో నిర్మించిన నూతన పాఠశాల భవనాన్ని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, పర్ణికారెడ్డి, అనిరుధ్ రెడ్డి, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్‌రెడ్డిలతో కలిసి ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అరుణ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర ఐజీ రమేష్ రెడ్డి ఇదే పాఠశాలలో చదువుకొని పోలీస్ ఉన్నతాధికారి అయ్యారని గుర్తు చేశారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి, ఉపాధ్యాయులకు.. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. వేదికపై కూర్చున్న వివిధ శాఖల అధికారులు, ఎంపీగా తాను, ఎమ్మెల్యేలు అందరం కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వాళ్లమేనని అన్నారు. ఈ పాఠశాల నిర్మాణానికి కేంద్రం రూ.71 లక్షలకు పైగా నిధులు విడుదల చేసిందని తెలిపారు. పాఠశాల నిర్మాణానికి గ్రామానికి చెందిన ఐజీ రమేష్ రెడ్డి ఎంతగానో కృషి చేశారన్నారు. హైదరాబాద్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, డీఈవో గోవిందరాజులు, ఎస్పీ గిరిధర్ రావు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.




**ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసింది గత పాలకులే: జి.చిన్నారెడ్డి**

ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 35 వేల ప్రభుత్వ పాఠశాలలు ఉంటే, అందులో 35 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని.. అదే 13 వేల ప్రైవేటు పాఠశాలలు ఉంటే.. అందులో 34 లక్షల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యను పూర్తిగా చిన్నాభిన్నం చేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నారని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, పర్ణికారెడ్డి, అనిరుధ్ రెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి మాట్లాడారు.

**డ్రగ్స్ నిర్మూలనకు నడుం బిగించాలి: ఐజీ**

ఐజీ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో విజృంభిస్తున్న డ్రగ్స్‌ను ప్రతీ ఒక్కరు పాఠశాల స్థాయి నుంచే నిర్మూలించేందుకు కృషి చేయాలని ఐజీ రమేష్ రెడ్డి పిలుపునిచ్చారు. డ్రగ్స్, మాదక ద్రవ్యాల కట్టడి కోసం రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ విశేషంగా కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు బాగా చదివి, ఊరుకు మంచి పేరు తేవాలన్నారు. ఈ గ్రామంలో పుట్టి, ఇదే ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నానన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఏ మాత్రం నిరుత్సాహ పడకుండా పట్టుదలతో చదివి, లక్ష్యాన్ని సాధించాలని కోరారు.

# హెల్త్ ఎమర్జెన్సీ అమలు చేయాలి

**జగిత్యాల-నవభూమి :** 'రాష్ట్రం జ్వరాల కుప్పగా మారిపోయింది. అనారోగ్యంతో ప్రజలు అల్లాడుతున్నరు. ప్రభుత్వ దవాఖానల్లో మంచానికి ముగ్గురు, నలుగురు రోగులు అన్నట్లుగా పరిస్థితి తయారైన క్రమంలో రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ విధించాలి' అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ఆగస్టు చివరి నాటికే రాష్ట్రంలో 8.5 లక్షల మందికి పైగా విష జ్వరాల బారిన పడ్డారని, ప్రాణాంతక డెంగ్యూ, చికున్ గున్యాతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేకపోవడం బాధాకరమన్నారు. ఆగస్టు 27 నాటికే రాష్ట్రం లో 4,459 డెంగ్యూ కేసులు నమోదయ్యాయని చెప్పిన వైద్యారోగ్యశాఖ, డెంగ్యూ కేసుతోనే కాదు, ఇతర ఏ విషజ్వరం వల్ల ఒక మరణం సంభవించలేదని నివేదిక ఇవ్వడం ఆశ్చర్యంగా ఉందన్నారు.డెంగ్యూ మరణాలు లేవని ప్రభుత్వం చెబుతుంటే పత్రికలు, మీడియాలో చికున్ గున్యా, డెంగీతో ప్రజలు చనిపోతున్నారన్న వార్తలు ఎలా వస్తున్నాయో..? చెప్పాలని ప్రశ్నించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కేవలం లక్ష లోపు మంది మాత్రమే జ్వరాల బారిన పడ్డారని, జగిత్యాలలో 18 వేల మంది ఉన్నారని వైద్య ఆరోగ్యశాఖ నివేదికలో పేర్కొన్నారని, అవన్నీ కాకి లెకలేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క జగిత్యాల జిల్లాలోనే దాదాపు 50 వేల మందికి పైగా విషజ్వరాల బారిన పడ్డారని తెలిపారు. ఇప్పటికే 20 మందికి పైగా డెంగ్యూ, చికున్ గున్యా లాంటి ప్రమాదకరమైన విషజ్వరాల బారిన పడి మృతిచెందారన్నారు. మూడు, నాలుగు రోజుల క్రితమే సారంగాపూర్ మండలంలో ఒక సింగిల్ విండో సీఈవో విషజ్వరంతో చనిపోయాడని, మల్లాపూర్ మండలానికి చెందిన యువకుడు విదేశాల నుంచి వచ్చి వివాహం చేసుకున్న 15 రోజులకే విషజ్వరంతో చనిపోయాడన్నారు. ఇంతలా విషజ్వరాలు విజృంభిస్తున్నా, ప్రభుత్వం మాత్రం అంగీకరించకపోవడం సరికాదన్నారు.ప్రభుత్వ దవాఖానల్లో కనీస సౌకర్యాలు లేకుండా పోయాయని, విషజ్వరాలకు సంబంధించిన మందులు, కీలకమైన అజిత్రోమైసిన్ , డైక్లోఫైన్ ఫార్ములా మెడిసిన్ అందుబాటులో లేకపోవడంతో రోగులు తప్పనిసరి పరిస్థితుల్లో మార్కెట్‌లో కొనుగోలు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేసీఆర్ హయాంలో దవాఖానల్లో ఉంచిన బఫర్ స్టాక్ మందులే ఇన్నాళ్లు వినియోగిస్తూ వచ్చామని, స్టాక్ పూర్తి కావడంతో మందుల కొరత తీవ్రంగా ఏర్పడిందని వైద్య సిబ్బందే చెబుతున్నారని తెలిపారు. అన్ని రకాల వైద్య సేవలు కుంటుపడ్డాయన్నారు.కేసీఆర్ కిట్లు అందడం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో 62 శాతం ప్రసవాలు నమోదైతే, ప్రైవేట్ లో 38 శాతం జరిగాయ ని, కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అయిందని, ఈ విషయంలో ప్రభుత్వం సిగ్గుపడాలని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేలొని పారదర్శకంగా విష జ్వరాల నివారణ కోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వొద్దినేని హరిచరణ్‌రావు, శీలం ప్రవీణ్, ప్రియాంక, దేవేందర్ నాయక్, వొల్లెం మల్లేశం పాల్గొన్నారు.

